# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 26-6-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 268 | పేజీలు: 4 | వెల: రూ.1/-







## అమెరికాలో కుప్పకూలిన భవనం.. 99 మంది మిస్సింగ్



న్యూఢిల్లీ, జూన్ 25:అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని మయామిలో ఓ 12 అంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందినట్టు నిర్ధారించారు. మరో 99 మంది గల్లంతైనట్టు భావిస్తున్నారు. ఇప్పటి వరకు 102 మందిని కాపాడగా.. 99 మంది కనిపించడం లేదని అధికారులు తెలిపారు. దాదాపు సగం కూలిపోయిన ఈ భవనంలో ఎంతమంది ఉన్నారన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదని పేర్కొన్నారు. మొత్తం 136 ఫ్లాట్లలో 55 ఫ్లాట్లు కుప్పకూలినట్టు గుర్తించారు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్టు అధికారులు వెల్లడించారు. ఈ చాంప్లైన్ టవర్స్ సౌత్ బిల్డింగ్ శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పటివరకు శిథిలాల నుంచి ఇద్దరిని వెలికితీసినట్టు చెప్పారు. ఈ భవనంలోని మరోవైపున ఉన్న ఫ్లాట్ల నుంచి ప్రజలను తరలిస్తున్నారు. దీని చుట్టు పక్కల ఉన్న భవనాల నుంచి కూడా ప్రజలను ఖాళీ చేయిస్తున్నారు.

## కరోనా థర్డ్ వేవ్ కట్టడికి కేంద్ర ప్రభుత్వం సన్నద్ధం

హైదరాబాద్ , జూన్ 25:కరోనా సెకండ్ వేవ్ దాదాపుగా ముగియడంతో ఇప్పుడు దేశమంతా థర్డ్ వేవ్‌పై దృష్టి సారించింది. ఎందుకంటే థర్డ్ వేవ్‌లో ఎక్కువగా చిన్నారులు కోవిడ్ బారిన పడతారని, అందులోనూ ప్రస్తుతం డెల్టా ప్లస్ వేరియంట్ ప్రమాదకరంగా మారుతోందని వార్తలు వస్తున్నాయి. ఒకవేళ కరోనా థర్డ్ వేవ్ వస్తే దానిని ధీటుగా ఎదుర్కోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సెకండ్ వేవ్ ప్రభావం థర్డ్ వేవ్‌పై ఉండకూడదని కేంద్రం ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఎమర్జెన్సీ కొవిడ్ రెస్పాన్స్ సన్నద్ధత (ఈసీఆర్‌పీ-2) కింద రూ 20,000 కోట్ల ప్యాకేజ్‌కు కేంద్ర ప్రభుత్వం కసరత్తు సాగిస్తున్నట్టు సమాచారం. కరోనా థర్డ్ వేవ్ వ్యాప్తిని అరికట్టేందుకు ఈ నిధి ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.

ఈ ప్యాకేజ్‌పై ప్రస్తుతం ఆరోగ్య, ఆర్థిక మంత్రిత్వ శాఖలు మదింపు చేస్తుండగా కేబినెట్ ఆమోదం పొందిన అనంతరం ప్యాకేజ్ వివరాలను వెల్లడిస్తారు. ఆస్పత్రుల్లో పడకల పెంపు, కొవిడ్-19 వైద్య పరికరాలు, చికిత్స సదుపాయాల పెంపు, అత్యవసర మందుల సరఫరాలతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఆరోగ్య మౌలిక వసతుల పెంపునకు ఈ నిధులను వెచ్చిస్తారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో ఈ ప్యాకేజ్ అమలు కానుండగా ఐసీఎంఆర్ వంటి పరిశోధనా సంస్థలకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంది. జీనోమ్ సీక్వెన్సింగ్ ద్వారా నూతన వేరియంట్లను గుర్తించడం ద్వారా చికిత్స సులువుగా చేపట్టే వెసులుబాటు ఉండటంతో పరిశోధనా సంస్థలను ఆ దిశగా ప్రోత్సహిస్తారు.

## పట్టణాల్లోనూ నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ , జూన్ 25: నగరంలో మరో నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ అందుబాటులోకి వచ్చింది. నాగోల్‌లోని ఫతుల్లాగూడలో భవన నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్ ప్లాంట్‌ను రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. వెట్ ప్రాసెసింగ్ సాంకేతిక పరిజ్ఞానంతో వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను నిర్మించారు. రోజుకు 500 టన్నుల నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగం చేస్తారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. పట్టణాల్లో కూడా నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామన్నారు.

వ్యర్థాల తరలింపునకు టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తెచ్చామన్నారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు టోల్ ఫ్రీ నంబర్ 18001201159. ఇప్పటికే జీడిమెట్లలో భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను నిర్మించామని గుర్తు చేశారు. జీడిమెట్ల ప్లాంట్‌లో రోజుకు 500 టన్నుల నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగం జరుగుతుందన్నారు. ఇవాళ ప్రారంభించిన ఫతుల్లాగూడ ప్లాంట్‌లో కూడా రోజుకు 500 టన్నుల నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్‌లో 2 వేల టన్నుల వ్యర్థాల పునర్వినియోగం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కేటీఆర్ చెప్పారు.

## పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరిస్తాం



హైదరాబాద్ , జూన్ 25: రాష్ట్రంలో 60 శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామ స్థాయిలో విజయవంతంగా అమలు కావడానికి గ్రామ కార్యదర్శులు చిత్తశుద్ధితో కృషి చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బంజారాహిల్స్ మినిస్టర్ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర జూనియర్ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ బాధ్యులు పీ.ఆర్.సి. అమలు గురించి మంత్రికి వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గతంలో కేవలం 3,396 గ్రామ కార్యదర్శులు ఉండగా, ప్రతి గ్రామానికి కచ్చితంగా ఒక కార్యదర్శి ఉండాలనే సంకల్పంతో 9,355 మందిని కాంట్రాక్టు పద్ధతిపై న రెండేండ్ల క్రితం నియమిం చామని మంత్రి తెలిపారు. సీఎం కేసీఆర్ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పట్ల సానుకూలంగా ఉన్నారని మంత్రి తెలిపారు. నిర్ణీత గడువు పూర్తి కాగానే వారికి న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. జూలై 1వ తేదీ నుంచి 10 రోజుల పాటు నిర్వహించనున్న పల్లె ప్రగతి, హరితహారం కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

## బోనాల నిర్వహణకు రూ. 15 కోట్లు : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి




హైదరాబాద్ , జూన్ 25: నగరంలో బోనాల పండుగ నిర్వహణకు రూ. 15 కోట్లు విడుదల చేశామని, చందాలు ఎవరూ వసూలు చేయొద్దని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సూచించారు. బోనాల ఉత్సవ ఏర్పాట్లపై మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, మల్లారెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావే శంలో నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీజీపీ మహేందర్ రెడ్డి, మేయర్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ సీపీ లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు తలమానికంగా నిలిచే బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ప్రతి ఏటా బోనాల ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నామని, కరోనా కారణంగా గత ఏడాది బోనాల ఉత్సవాలను నిర్వహించలేదన్నారు. అయితే ఈ సంవత్సరం కోవిడ్ మార్గదర్శకాల మేరకు బోనాల సంబరాలను జరుపుకునేలా అన్నిశాఖల అధికారుల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు.

బోనాలు జరిగే అన్ని దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని, రహదారులను శుభ్రంగా ఉండేలా చూడాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీతో పాటు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. విజయవంతంగా బోనాల ఉత్సవాలను నిర్వహించాలన్నారు. గంగ, జమున, తెహజీబ్ సంస్కృతికి నిలయమైన హైదరాబాద్ నగరంలో అందరూ ప్రశాంతంగా బోనాలు నిర్వహించుకోవాలని, పోలీస్ యంత్రాంగానికి సహకరించాలని మంత్రులు కోరారు.

### జులై 11న తొలి బోనం

జూలై 11న గోల్కొండ జగదాంబ మహంకాళి అమ్మవారికి తొలిబోనం సమర్పించడంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయం వద్ద జూలై 25న బోనాలు, జూలై 26న రంగము నిర్వహిస్తారు. హైదరాబాద్ లాల్ దర్వాజ మహంకాళి అమ్మవారికి ఆగస్టు ఒకటో తేదీన బోనం సమర్పించి, ఆ మరుసటి రోజు బోనాల ఊరేగింపును నిర్వహిస్తారు.

## ఇండియాలోని 18 జిల్లాల్లో 48 డెల్టా ప్లస్ వేరియంట్ కేసులు

న్యూఢిల్లీ, జూన్ 25:ఇండియాలో కరోనా డెల్టా ప్లస్ వేరియంట్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా దేశంలోని 18 జిల్లాల్లో 48 కేసులు నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్సీడీసీ) డైరెక్టర్ సుజీత్ సింగ్ శుక్రవారం వెల్లడించారు. అత్యధికంగా మహారాష్ట్రలో 20 డెల్టా ప్లస్ వేరియంట్ కేసులు నమోదు కా గా.. తమిళనాడులో 9, మధ్యప్రదే శ్ లో 7, కేరళలో 3, గుజరాత్, పంజాబ్ లో రెండేసి కేసులు, ఆంధ్రప్ర దేశ్, ఒడిశా, జమ్ముకశ్మీర్, రాజస్థాన్, కర్ణాటకల్లో ఒక్కో కేసు నమోదైనట్లు ఆయన చెప్పారు. ఇక ఆందోళనకర వేరి యంట్ అయిన డెల్టా వేరియంట్ కేసులు 50 శాతానికిపైగా ఉన్న 8 రాష్ట్రాలపైనే ప్రధానంగా దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, హర్యానా, కేరళ, మహారాష్ట్ర, పంజాబ్, వెస్ట్ బెంగాల్ ఉన్నాయి.

## కొవిడ్ కమాండ్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్ , జూన్ 25: నగరంలోని వెంగళ్రావు నగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కొవిడ్ కమాండ్ సెంటర్‌ను రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, సీఎస్ సోమేశ్ కుమార్, ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఈ సెంటర్ ప్రారంభోత్సవం కంటే ముందు కేటీఆర్ ట్వీట్ చేశారు. శాంతి కోసం ఎంత శ్రమిస్తే.. యుద్ధంలో అంత తక్కువ రక్తాన్ని చిందిస్తాము అని కేటీఆర్ తన ట్వీట్‌లో అభిప్రాయపడ్డారు. ఈ కొవిడ్ కమాండ్ సెంటర్‌ను అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా కరోనా థర్డ్ వేవ్‌ను, కరోనా ఇతర సమస్యలను పూర్తిగా అరికట్టే అవకాశం ఉందన్నారు.

## కుట్టు మిషన్లు పంపిణీ చేసిన మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట, జూన్ 25:: మహిళలు స్వయం ఉపాధి పొంది అందరికీ ఆదర్శంగా నిలుస్తూ.. ఆత్మ విశ్వాసంతో ఎదిగి మీ కుటుంబాన్ని కూడా ఆదర్శంగా నిలపాలన్నదే నా కోరికని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సుడా కార్యాలయంలో అంజయ్య మెమోరియల్ సహకారంతో ఇర్కోడు, తోర్నాల గ్రామ మహిళలకు రూ.18 లక్షల వ్యయంతో 62 కుట్టు మిషన్‌లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కుట్టు మిషన్‌లను అందించడంతో పాటుగా కమర్షియల్ ఆర్డర్లు వచ్చేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

ఒక్కో కుట్టు మిషన్ ధర రూ.28 వేల విలువ ఉంటుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఆటోమైజ్ కుట్టు మిషన్ పై అన్ని రకాల కుట్లు వేసుకోవచ్చని తెలిపారు. ప్రేమతో, ఆప్యాయతతో ప్రముఖ సామాజిక కార్యకర్త చందర్‌రావు, అంజయ్య మెమోరియల్ బాధ్యులు అర్జున్‌గౌడ్, రాజేశ్వర్ వారి తండ్రి జ్ఞాపకార్థం ఈ కుట్టు మిషన్‌లు అందించడం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, సిద్దిపేట రూరల్ వైస్ ఎంపీపీ శేరిపల్లి యాదగిరి, తోర్నాల సర్పంచ్ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ ధీవర్యుండై చెలుగుచు
పావనమగు తెలుగువారి పద్యమ్మునకున్
కోవెలగా వెలుగొందిన
కోవెల సంపత్కుమారు గొలుచుచు నుంటిన్ !!

–రాధశ్రీ

( జూన్ 26 కవి కోవెల సంపత్కుమారాచార్య జయంతి..)

సెల్: 9494481210



## నిరుద్యోగ యువతకు సదవకాశం

భారతీయ తపాలా శాఖ వారు కమిషన్ బేసిస్ పై తపాలా జీవిత బీమా మరియు గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలు సేకరించడానికీ ఏజెంట్లను నియమిస్తున్నారు. 10 వ తరగతి పాస్ అయ్యి 18 నుండి 50 సంవత్సరాల మధ్య ఉన్న నిరుద్యోగ యువత హైదరాబాద్ సిటీ ప్రాంతంలో ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరు.

ఆసక్తి కలిగినవారు మీ అప్లికేషన్స్ సికింద్రాబాద్ డివిజనల్ ఆఫీస్, గాంధీనగర్ లో 25/07/2021 తేదీ లోపు ఇవ్వగలరు. ఎంపిక చేసిన అభ్యర్థులు తేదీ 05/08/2021 మరియు 06/08/2021 ఉదయం 10 గంటలకు సంబంధిత సర్టిఫికెట్స్ తో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సికింద్రాబాద్ తపాలా సీనియర్ సూపరింటెండెంట్ శ్రీ కె. సంతోష్ నేత గారు సూచించడమైనది. ఏజెంట్ గా నియమితులైన వారు, సెక్యూరిటి డిపాజిట్ గా రూ. 5000/- చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు మీ సమీపంలోని పోస్ట్ ఆఫీస్ ను లేదా సికింద్రాబాద్ డివిజనల్ ఆఫీస్ , గాంధీనగర్ ను సంప్రదించగలరు.

## రైతువేదికలు నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌దే



రంగారెడ్డి, జూన్ 25:: జిల్లా పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామంలో రైతు వేదిక భవనం ప్రారంభంతో పాటు చెక్ డ్యామ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రేగడి దొస్వాడ గ్రామంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం దిశగా అభివృద్ధి కొనసాగుతుందన్నారు.

కరోనా వల్ల ఆదాయం తగ్గినా తెలంగాణ లో 308 కోట్లు ప్రతి నెల గ్రామాలకు పల్లె ప్రగతి నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి తెలిపారు. 60 లక్షల మంది రైతులకు రైతు బంధు సహాయం అందజేశామన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. రైతుల కోసం రాష్ట్రంలో 2,604 రైతు వేదికలు నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

ఇంటింటి జ్వర సర్వే తో తెలంగాణ లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పై డిస్కవరీ ఛానల్‌లో ఈ రోజు రాత్రి ప్రసారం అయ్యే డాక్యుమెంటరీని అందరూ చూడాలన్నారు. పాలనలో నూతన ఒరవడి సృష్టిస్తున్న సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచి పోతారన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో రూ.11 కోట్ల 50 లక్షలతో చెక్ డ్యాంలు నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు.

# జమ్మూకాశ్మీర్ పై సమావేశం ఒక ముఖ్యమైన అడుగు : ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 25:అభివృద్ధి చెందిన మరియు ప్రగతిశీల జమ్మూకాశ్మీర్ దిశగా జరుగుతున్న ప్రయత్నాలలో భాగంగా జమ్మూ కాశ్మీర్ కి చెందిన రాజకీయ నాయకులతో ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ సమావేశమయ్యారు. సర్వతోముఖాభివృద్ధి ఇక్కడ సాధ్యమయ్యే దిశగా సమావేశం ఏర్పాటు చేశారు.

సమావేశం తరువాత ప్రధాన మంత్రి వరుస ట్వీట్లు చేశారు.

" అభివృద్ధి చెందిన మరియు ప్రగతిశీల జమ్మూకాశ్మీర్ దిశగా ప్రస్తుతం జరుగుతున్న ప్రయత్నాలలో భాగంగా జమ్మూ కాశ్మీర్ కి చెందిన రాజకీయ నాయకులతో నేడు జరిగిన సమావేశం సర్వతోముఖాభివృద్ధికి మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం.

మా ప్రాధాన్యత జమ్మూ కాశ్మీర్ లో అట్టడుగు స్థాయి వరకు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం. ఎన్నికలు జరగడానికి డీలిమిటేషన్ త్వరితగతిన జరగాలి మరియు జమ్మూకాశ్మీర్ అభివృద్ధి పథానికి బలాన్నిచ్చేలా ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని జమ్మూకాశ్మీర్ పొందుతుంది. చర్చల ద్వారా పరస్పరం ఆలోచనలు పంచుకోవడం మన ప్రజాస్వామ్య అతి పెద్ద బలం. ప్రజలు, ప్రత్యేకించి యువత, జమ్మూకాశ్మీర్ కి రాజకీయ నాయకత్వం ఇవ్వాలి. వారి ఆకాంక్షలు సక్రమంగా నెరవేరాలి అని నేను జమ్మూకాశ్మీర్ నాయకులకు చెప్పాను"

## నా ట్విట్టర్ అకౌంట్ పనిచేయలేదు : కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్



న్యూఢిల్లీ, జూన్ 25: కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఇవాళ తన ట్విట్టర్ అకౌంట్‌ను యాక్సెస్ చేయలేకపోయారు. తన అకౌంట్ ఒక గంట పాటు తాత్కాలికంగా పనిచేయలేదని మంత్రి తెలిపారు. ఆ సమయంలో ఆయన ఎటువంటి ఫోటోలను కానీ, వీడియోలను కానీ పోస్టు చేయలేకపోయారు. టీవీ చర్చలకు సంబంధించిన వీడియోలను పోస్టు చేయడం వల్ల.. ఆ పోస్టులు కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘించిన ఆరోపణలపై తన ట్విట్టర్ ఖాతా పనిచేయలేదని మంత్రి వెల్లడించారు. ఇటీవల కొత్త ఐటీ రూల్స్ తెచ్చిన కేంద్ర ప్రభుత్వానికి, సోషల్ మీడియా సంస్థ ట్విట్టర్‌కు మధ్య మాటల యుద్ధం నడుస్తున్న విషయం తెలిసిందే. అయితే మంత్రి అకౌంట్ మాత్రం నెట్ యూజర్లకు కనిపించింది. కానీ మంత్రి అకౌంట్‌లోకి లాగిన్ కావడానికి లేదా పోస్టు చేయడానికి మాత్రం యాక్సెస్ దొరకలేదు. కాంటెంట్ పోస్టు చేస్తున్న సమయంలో డిజిటల్ మిలీనియమ్ కాపీరైట్ యాక్ట్ నోటీసు వచ్చినట్లు మంత్రి తెలిపారు. అయితే ట్విట్టర్ చర్యలను మంత్రి ఖండించారు. ఐటీ చట్టంలోని రూల్ 4(8)ను ఉల్లంఘించినట్లు అవుతుందని ఆయన ఆరోపించారు. ఎటువంటి నోటీసు ఇవ్వకుండా తన అకౌంట్‌కు యాక్సెస్ ఇవ్వలేదన్నారు.

# మాస్క్‌పై వాగ్వాదం.. వ్యక్తిపై బ్యాంక్ సెక్యూరిటీ గార్డ్ కాల్పులు

లక్నో, జూన్ 25: : మాస్క్ ధరించే విషయంలో చోటుచేసుకున్న వాగ్వాదం ఓ వ్యక్తిపై కాల్పులకు దారితీసింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలీ జిల్లాలో బ్యాంక్ ఆఫ్ బరోడాకు కుమార్ అనే ఓ కస్టమర్ వచ్చాడు. అయితే అతడు మాస్క్ ధరించకపోయేసరికి సెక్యూరిటీ గార్డు అడ్డుకుని మాస్కు ధరించాల్సిందిగా కోరాడు. లేకపోతే బ్యాంక్ లోపలికి అనుమతించేది లేదని పేర్కొన్నాడు. సదరు వ్యక్తి మాస్క్ ధరించి సెక్యూరిటీ గార్డ్‌తో వాగ్వాదానికి దిగినట్లుగా సమాచారం.

ఈ వాగ్వాదం ముదరడంతో సెక్యూరిటీ గార్డ్ అతనిపై ఓ రౌండ్ కాల్పులు జరిపాడు. అదృష్టవశాత్తు బుల్లెట్ తొడలోకి దూసుకెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు సెక్యూరిటీ గార్డ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వ్యక్తి దుర్భాషలాడంతో అప్పటికే లోడ్ అయి ఉన్న గన్ ట్రిగ్గర్ అనుకోకుండా నొక్కడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సెక్యూరిటీ గార్డ్ తెలిపాడు.

బాధితుడి బంధువు ఒకరు మాట్లాడుతూ.. బ్యాంకులోకి ప్రవేశించే క్రమంలో గార్డు కుమార్‌ని మాస్క్ ధరించమని అడిగాడు. బయటకు వెళ్లి మాస్క్ ధరించి తిరిగి బ్యాంక్‌లోకి వెళ్తుంటే మళ్లీ అడ్డుకుని లంచ్ టైం అని చెప్పి లోపలికి అనుమతించలేదు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గార్డ్ కావాలనే నెట్టివేసి కాల్పులు జరిపినట్లు పేర్కొన్నాడు.

# 30 వరకు 4 రోజులు బ్యాంకులకు సెలవు.. ఎందుకంటే?!

ముంబై, జూన్ 25:: నిత్యం బ్యాంకుల్లో లావాదేవీలు జరిపేవారు ఆయా బ్యాంకుల పని దినాల్లో మాత్రమే పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. కానీ ఈ నెల 25 నుంచి 30 వరకు నాలుగు రోజులు సెలవులు ఉన్నాయి.

కనుక మీరు బ్యాంకులో ఏదైనా ముఖ్యమైన పని ఉంటే పూర్తి చేసుకోవాలని భావిస్తే, ముందుగా ఆయా బ్యాంకుల సెలవు దినాలను పరిగణనలోకి తీసుకోండి. అందుకు ఆర్బీఐ అధికారిక వెబ్‌సైట్‌కు వెళితే ఏ నెలలో ఏయే రోజుల్లో సెలవులు ఉన్నాయో తెలుస్తుంది.

బ్యాంకుల పని దినాలను బట్టి మీరు మీ బ్యాంకు శాఖకు వెళ్లి లావాదేవీలు పూర్తి చేసుకోవచ్చు. ఆర్బీఐ హాలీడే క్యాలెండర్ ప్రకారం జూన్‌లో తొమ్మిది రోజులు బ్యాంకులకు సెలవులు. రాష్ట్రాల వారీగా విభిన్నంగా ఉండొచ్చు. ఈ నెల 25-30 మధ్య నాలుగు రోజుల సెలవుల్లో రెండు పండుగలు ఉన్నాయి.

ఈ నెల 25న గురు హర్‌గోవింద్ జీ జయంతి.. జమ్మూకశ్మీర్ వాసులు సెలబ్రేట్ చేసుకుంటారు. 30న మిజోరంలోని ఐజ్వాల్‌లో రెమ్నానీ సందర్భంగా బ్యాంకులు పని చేయవు. 26న నాలుగో శనివారం, 27న ఆదివారం బ్యాంకులకు సెలవు.

నోటిఫైడ్ సెలవు దినాల్లో ప్రభుత్వ, ప్రైవేట్, ప్రాంతీయ, విదేశీ బ్యాంకులు ఆయా ప్రాంతాలు, రాష్ట్రాల్లో బ్యాంకులు పని చేయవు. అయితే, ఖాతాదారులు మొబైల్, ఇంటర్నెట్ సర్వీసులతోపాటు వివిధ రకాల ఆన్‌లైన్ మోడ్‌లలో లావాదేవీలు జరుపుకోవచ్చు.



# ప్రధానమంత్రి నాయకత్వాన జమ్ముకశ్మీర్ రాజకీయ పార్టీలతో సమావేశం అనంతరం కేంద్ర సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జూన్ 24:గౌరవనీయులైన ప్రధానమంత్రి నాయకత్వాన జమ్ముకశ్మీర్‌కు చెందిన రాజకీయ పార్టీలతో సాగిన చర్చలు కొద్దిసేపటి కిందటే ముగిశాయి. జమ్ముకశ్మీర్‌లో ప్రజాస్వామ్య ప్రగతి, బలోపేతం దిశగా అత్యంత నిర్ణయాత్మక కృషిలో ఇదొక భాగం. అత్యంత సౌహార్ద వాతావరణంలో సాగిన ఈ సమావేశం పాల్గొన్నవారందరూ భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై తమ సంపూర్ణ విధేయతను ప్రకటించారు. జమ్ముకశ్మీర్‌లో పరిస్థితులు మెరుగుపడటంపై కేంద్ర హోంశాఖ మంత్రి నాయకులందరికీ ఈ సందర్భంగా వివరించారు. ప్రతి పార్టీ వినిపించిన వాదనలను, సూచనలను ప్రధానమంత్రి అత్యంత శ్రద్ధగా ఆలకించారు. ఈ మేరకు ప్రజా ప్రతినిధులందరూ తమ దృష్టికోణాన్ని నిష్పాక్షికంగా వెల్లడించడాన్ని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో రెండు కీలకాంశాలకు ప్రధానమంత్రి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. తదనుగుణంగా మొదట జమ్ముకశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని క్షేత్రస్థాయికి చేర్చేందుకు మనమంతా సమష్టిగా కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు. అటుపైన జమ్ముకశ్మీర్‌లో సర్వతోముఖాభివృద్ధి అవసరమని, ఈ ప్రగతి ఫలాలు ప్రతి ప్రాంతంతోపాటు ప్రతి సమాజానికీ చేరాలన్నది మన రెండో కర్తవ్యమని వివరించారు. ఈ లక్ష్య సాధనకు ప్రజల భాగస్వామ్యంతో కూడిన సహకారపూరిత వాతావరణం ఏర్పడటం అవశ్యమని నొక్కిచెప్పారు. జమ్ముకశ్మీర్‌లో పంచాయతీరాజ్, స్థానిక సంస్థల ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడాన్ని కూడా గౌరవనీయులైన ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. భద్రత పరిస్థితులు కూడా మెరుగుపడ్డాయని చెప్పారు. ఎన్నికలు పూర్తయ్యాక పంచాయతీలకు దాదాపు రూ.12000 కోట్లు నేరుగా అందాయని గుర్తుచేశారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి వేగం పుంజుకున్నదని చెప్పారు.

జమ్ముకశ్మీర్‌లో ప్రజాస్వామ్య ప్రక్రియకు సంబంధించి తదుపరి ముఖ్యమైన దశకు? అంటే- శాసనసభ ఎన్నికలకు సన్నద్ధం కావాల్సి ఉందని ప్రధానమంత్రి అన్నారు. ఇందులో భాగంగా ప్రతి ప్రాంతానికి, ప్రతి వర్గానికి శాసనసభలో రాజకీయ ప్రాతినిధ్యం లభించేలా నియోజకవర్గ హద్దుల నిర్ణయ ప్రక్రియను సత్వరం పూర్తిచేయాల్సి ఉందన్నారు. ముఖ్యంగా దళితులు, వెనుకబడిన/గిరిజన ప్రాంతాల్లో నివసించే వర్గాలవారికి సముచిత ప్రాతినిధ్యం దక్కేవిధంగా చూడటం అవసరమని స్పష్టం చేశారు. ఆ మేరకు సరిహద్దుల నిర్ణయ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవడంపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. తదనుగుణంగా ఈ ప్రక్రియలో భాగస్వాములు అయ్యేందుకు అన్ని పార్టీల నాయకులూ అంగీకరించారు.

జమ్ముకశ్మీర్‌ను శాంతిసౌభాగ్య పథాన నడిపించడంలో భాగస్వాములందరి సహకారం అవసరమని ప్రధానమంత్రి ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. జమ్ముకశ్మీర్ హింసాత్మక విష వలయం నుంచి బయటపడుతూ స్థిరత్వం దిశగా అడుగులు వేస్తున్నదని ఆయన గుర్తుచేశారు. దీనికి తగినట్లుగా జమ్ముకశ్మీర్ ప్రజల్లో కొత్త ఆశలు, సరికొత్త విశ్వాసం చిగురిస్తుండటమే అందుకు నిదర్శనమన్నారు. ప్రజల్లోగల ఈ నమ్మకాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి, ఆత్మవిశ్వాసం మెరుగకు మనమంతా రాత్రింబవళ్లు నిర్విరామంగా కృషిచేయాల్సి ఉందని ప్రధానమంత్రి స్పష్టీకరించారు.

జమ్ముకశ్మీర్ ప్రగతి, సౌభాగ్యాలతోపాటు ప్రజాస్వామ్య బలోపేతం దిశగా నేటి సమావేశం ఒక ముఖ్యమైన ముందడుగు. ఈ నేపథ్యంలో దీనికి హాజరైన రాజకీయ పార్టీలన్నిటికీ నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

# అత్యవసరమైన విభాగాలకు తగిన అభివృద్ధి మరియు పురోగతిని సాధించే సామర్థ్యం ఆట బొమ్మల రంగానికి ఉంది- ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 25:"టాయ్‌కాథన్ -2021'' లో పాల్గొన్న వారితో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, ఈ రోజు, దృశ్య మాధ్యమం ద్వారా సంభాషించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్, సహాయ మంత్రి శ్రీ సంజయ్ ధోత్రే పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంకా - కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, శ్రీ అమిత్ ఖరే; జౌళి మంత్రిత్వ శాఖ కార్యదర్శి, శ్రీ ఉపేంద్ర ప్రసాద్ సింగ్; ఎ.ఐ.సి.టి.ఇ., ఛైర్మన్, ప్రొఫెసర్ అనిల్ డి. సహస్రబుధే; ఇన్నోవేషన్ సెల్, విద్యా మంత్రిత్వ శాఖ, చీఫ్ ఇన్నోవేషన్ అధికారి, డాక్టర్ అభయ్ జెరె; ఎ.ఐ.సి.టి.ఇ., వైస్ చైర్మన్, డాక్టర్ ఎం.పి. పూనియా; విద్యా మంత్రిత్వ శాఖ, ఇన్నోవేషన్ సెల్, డైరెక్టర్, డాక్టర్ మోహిత్ గంభీర్ ప్రభృతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, గత 5-6 సంవత్సరాల్లో, దేశంలోని యువత "హాకథాన్స్" వేదిక ద్వారా దేశంలోని ముఖ్య సవాళ్లతో అనుసంధానించబడ్డారని తెలిపారు. దీని నేపథ్యం గురించి ఆలోచిస్తే దేశ సామర్థ్యాలను నిర్వహించడం, వారికి ఒక మాధ్యమాన్ని సమకూర్చడం అని ఆయన పేర్కొన్నారు.

పిల్లల మొదటి స్నేహితుడిగా బొమ్మల ప్రాముఖ్యతతో పాటు, బొమ్మలు, గేమింగ్ యొక్క ఆర్థిక అంశాలను కూడా ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. దీనినే, ఆయన, 'టాయ్ ఎకానమీ' అని పిలిచారు. ప్రపంచ వ్యాప్తంగా పిల్లల ఆట బొమ్మల మార్కెట్ సుమారు 100 బిలియన్ డాలర్లు కాగా, ఈ మార్కెట్లో భారతదేశానికి 1.5 శాతం వాటా మాత్రమే ఉందని ప్రధానమంత్రి చెప్పారు. భారతదేశం తన ఆట బొమ్మలలో దాదాపు 80 శాతం దిగుమతి చేసుకుంటోంది. అంటే మన దేశ ఆర్థిక వ్యవస్థ నుండి కోట్లాది రూపాయలు బయటకు పోతున్నాయి. ఈ పరిస్థితి మారాలని, ప్రధానమంత్రి, ఆకాంక్షించారు. సమాజానికి అవసరమైన విభాగాలకు తగిన పురోగతి మరియు అభివృద్ధిని తీసుకువచ్చే సామర్థ్యం ఈ రంగానికి ఉందని శ్రీ మోదీ నొక్కిచెప్పారు. ఆట బొమ్మల పరిశ్రమ స్వతహాగా, గ్రామీణ జనాభా, దళితులు, పేద ప్రజలు మరియు గిరిజన జనాభా కలిగిన చేతివృత్తులవారితో కూడిన, చిన్న తరహా పరిశ్రమగా కొనసాగుతోంది. ఈ రంగంలో మహిళల సహకారాన్ని ప్రధానమంత్రి ప్రత్యేకంగా గుర్తించారు. ఈ విభాగాలకు ప్రయోజనాలు కల్పించ డానికి వీలుగా స్థానిక ఆట బొమ్మల కోసం మనం మౌఖిక ప్రచారం చేయవలసిన అవసరం ఉంది. ప్రపంచ స్థాయిలో భారతీయ ఆట బొమ్మలను పోటీగా నిలపడానికి వీలుగా కొత్త ఆవిష్కరణల నమూనాలతో, పెట్టుబడులు పెట్టాలని, ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. కొత్త ఆలోచనలను రూపొందించి, కొత్త అంకుర సంస్థలను ప్రోత్సహిస్తూ, సాంప్రదాయ బొమ్మల తయారీదారులకు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి, కొత్త మార్కెట్ డిమాండ్‌ను సృష్టించవలసిన అవసరం ఎంతైనా ఉందని, ఆయన, సూచించారు. "టాయ్యాథన్" వంటి కార్యక్రమాల నిర్వహణ వెనుక ఉన్న ప్రేరణ ఇదే అని, ప్రధానమంత్రి పేర్కొన్నారు.

ఇంటర్నెట్ నేతృత్వంలోని గ్రామీణ కనెక్టివిటీ యొక్క చౌక డేటా మరియు వృద్ధిని ప్రధానమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో, భారతదేశంలో వర్చువల్, డిజిటల్ మరియు ఆన్‌లైన్ గేమింగ్‌లో అవకాశాలను అన్వేషించాలని ఆయన పిలుపునిచ్చారు. మార్కెట్లో లభించే ఆన్-లైన్ మరియు డిజిటల్ ఆటలు చాలావరకు భారతీయ భావనల ఆధారంగా లేవని ప్రధానమంత్రి పేర్కొంటూ, ఇలాంటి అనేక ఆటలు హింసను ప్రోత్సహిస్తున్నాయనీ, మానసిక ఒత్తిడిని కలిగిస్తున్నాయనీ, ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశ సామర్థ్యాలు, కళ, సంస్కృతి మరియు సమాజం గురించి అంతర్జాతీయ సమాజం తెలుసుకోవాలనుకుంటోందన్న విషయాన్ని, ప్రధానమంత్రి ప్రముఖంగా పేర్కొన్నారు. ఈ విషయంలో పిల్లల ఆట బొమ్మలు పెద్ద పాత్ర పోషించనున్నాయని, ఆయన అన్నారు. భారతదేశంలో డిజిటల్ గేమింగ్ కు అవసరమైన విషయ పరిజ్ఞానం, సామర్థ్యం సమృద్ధిగా ఉన్నాయని కూడా ప్రధానమంత్రి పేర్కొన్నారు. భారతదేశానికి ఉన్న సామర్థ్యాలు, ఆలోచనలను తెలియజేసే వాస్తవ పరిస్థితిని ప్రపంచానికి తెలియజెప్పే బాధ్యతను చేపట్టాలని, శ్రీ నరేంద్రమోదీ, యువ ఆవిష్కర్తలకు, అంకురసంస్థలకు పిలుపునిచ్చారు.

ఆట బొమ్మల పరిశ్రమకు చెందిన ఆవిష్కర్తలు మరియు సృష్టికర్తలకు, భారతదేశ స్వాతంత్ర్యం 75వ వార్షికోత్సవం, ఒక గొప్ప అవకాశమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. అనేక సంఘటనలు, మన స్వాతంత్ర్య సమరయోధుల కథలు, వారి శౌర్యం, నాయకత్వానికి చెందిన సంఘటనలను గేమింగ్ భావనలుగా సృష్టించే అవకాశం ఉంది. 'జానపదాలను భవిష్యత్తుతో' అనుసంధానించడంలో ఈ ఆవిష్కర్తలకు పెద్ద పాత్ర ఉంది. "నిమగ్నమవ్వండి, వినోదం ఇవ్వండి, అవగాహన కల్పించే' ఆసక్తికరమైన, పరస్పరం సంప్రదించే అవకాశం ఉన్న ఆటలను సృష్టించాల్సిన అవసరం ఉందని, ప్రధానమంత్రి, వివరించారు.

''టాయ్‌కాథన్'' నిర్వహణలో, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, మొదటి నుండీ మార్గదర్శకత్వం అందించినందుకు మరియు పాల్గొన్న వారి తో సంభాషించి, వారికి మార్గనిర్దేశం చేసినందుకు విదేశాంగ మంత్రి శ్రీ సంజయ్ ధోత్రే, ప్రధానమంత్రి కి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

భారతదేశాన్ని ఆట బొమ్మల ఉత్పత్తి కేంద్రంగా మార్చడంలో, "టాయ్‌కాథన్" సమర్థవంతంగా పనిచేస్తుందని శ్రీ ధోత్రే ఉద్ఘాటించారు. భారతదేశం లోని ఆట బొమ్మల పరిశ్రమ రంగాన్ని, అన్ని వయసుల ఆవిష్కర్తలు, పరిశోధకులతో అనుసంధానం చేయడం ద్వారా కొత్త మార్గాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రయత్నమని, ఆయన, ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. ఈ "టాయ్‌కాథన్" ద్వారా, భారతీయ సంప్రదాయం, చరిత్ర, సంస్కృతికి అనుగుణంగా ఆట బొమ్మలను అభివృద్ధి చేసే ప్రయత్నం జరిగిందని కూడా, ఆయన తెలియజేశారు.

దేశంలో మొట్టమొదటిసారిగా నిర్వహించిన ఈ "టాయ్‌కాథన్'' లో దేశవ్యాప్తంగా విద్యార్థులు, అంకుర సంస్థల వ్యవస్థాపకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని ఆయన ప్రత్యేకంగా తెలియజేశారు. 2021 జనవరి 5వ తేదీన ప్రారంభమైన, "టాయ్‌కాథన్ -2021" భారీ ముగింపు ఉత్సవం 2021 జూన్, 22వ తేదీ నుండి 24వ తేదీ వరకు ఏర్పాటు చేశారు. విజేతల వివరాలు 2021 జూన్, 26వ తేదీన ప్రకటిస్తామని, వారికి 60 లక్షల రూపాయల మేర నగదు పురస్కారాలను ప్రదానం చేయనున్నామని కూడా ఆయన తెలియజేశారు.

# పొగాకు నియంత్రణపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ముసాయిదా

హైదరాబాద్ , జూన్ 25: 'ప్రపంచ పొగాకు నియంత్రణ' పాతికేళ్ల ప్రగతిని ప్రముఖంగా ప్రస్తావిస్తూ కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ ఇవాళ వర్చువల్ సదస్సులో ప్రసంగించారు. "బాలల కోసం పొగాకు విముక్త ఉద్యమం" సంస్థ 25వ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ సదస్సులో గంటపాటు వర్చువల్ మాధ్యమం ద్వారా ప్రత్యేక కార్యక్రమాల ప్రదర్శన సాగింది. ప్రపంచవ్యాప్తంగా పొగాకు వినియోగాన్ని గణనీయంగా తగ్గించడంలో పొగాకు నియంత్రణ ఉద్యమాలు ఏ మేరకు విజయం సాధించిందీ ఇందులో ప్రముఖంగా ప్రదర్శించారు. పొగాకు వినియోగంలో రెండంకెల తగ్గుదల నమోదైన ఐదు దేశాల నుంచి ఎంపిక చేసిన అధికారులు, సామాజిక సంఘాల నాయకులు ఇందులో పాల్గొన్నారు. ఈ సదస్సునుద్దేశించి కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ ప్రసంగిస్తూ- గడచిన 75 ఏళ్లలో భారత దేశవ్యాప్తంగా సాంక్రమిక వ్యాధుల నియంత్రణలో గణనీయ ప్రగతి సాధించినట్లు వెల్లడించారు. అకాల, అసాంక్రమిక వ్యాధుల సంబంధిత మరణాలతోపాటు అనేక అనారోగ్యాలకు పొగాకు వినియోగమే కారణమని, ప్రజారోగ్యానికి ఇదొక సవాలుగా పరిణమించిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

### కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ ప్రసంగం పూర్తిపాఠం:

"విశిష్ట అతిథులారా! మనమంతా గర్వించాల్సిన 'బాలల కోసం పొగాకు విముక్త ఉద్యమం' 25 వార్షికోత్సవంలో మీతోపాటు పాల్గొనే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు. ఈ సంస్థ నేతృత్వంలో ఇన్నేళ్లుగా సాధించిన అనేక విజయాలపై నా వంతుగా ఎనలేని ప్రశంసలు తెలియజేస్తున్నాను. అయితే, పొగాకు వినియోగం మానవ సమాజంలో ఎంతగా అల్లుకుపోయిందంటే- ఈ సాంక్రమిక వ్యాధిని అదుపు చేయడానికి అవిశ్రాంత కృషి అవసరం. ఈ నేపథ్యంలో మిత్రులారా- భారతదేశం తన 75వ స్వాతంత్ర్య వార్షికోత్సవానికి చేరువవుతోందని ప్రకటించడానికి ఈ సందర్భంగా నేనెంతో సంతోషిస్తున్నాను. గడచిన 75 ఏళ్లలో జనాభా ఆరోగ్యస్థాయి సాధనలో భారత్ విశేష ప్రగతి సాధించింది. సాంక్రమిక వ్యాధులను అరికట్టడంలో కొన్నేళ్లుగా మేం గణనీయ పురోగతి సాధించాం. దీనివల్ల సాంక్రమిక వ్యాధి సంబంధిత అనారోగ్యాలు, మరణాలు బాగా తగ్గాయి. కానీ, అసాంక్రమిక వ్యాధులు దీర్ఘకాలికమైన గుండెజబ్బులు, మధుమేహం, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, కేన్సర్లు, మానసిక ఆరోగ్య రుగ్మతలు, గాయాలు వంటివి క్రమంగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల నడుమ పొగాకు వినియోగం అకాల, అసాంక్రమిక వ్యాధులతో ముడిపడిన మరణాలతోపాటు అనేక అనారోగ్యాలకు దారితీస్తూ ప్రజారోగ్యానికి సవాలుగా పరిణమించింది. భారతదేశంలో పొగాకు వినియోగ నియంత్రణ కృషి మొత్తం 130 కోట్ల జనాభాకూ చేరువ కావాలన్నది లక్ష్యం. ఆ మేరకు దీని దుష్ప్రభావాలు, దానితో ముడిపడిన ముప్పుల గురించి ప్రతి వయోవర్గానికీ అవగాహన కల్పించడం దీని ఉద్దేశం. నా రాజకీయ జీవితం తొలినాళ్లలో ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నప్పుడు 1997లో నేను 'ఢిల్లీలో ధూమపాన నిషేధం-పొగతాగనివారి ఆరోగ్య రక్షణ చట్టం' రూపొందించగా శాసనసభ దాన్ని ఆమోదించింది. గౌరవనీయ సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు 'బహిరంగ స్థలాల్లో ధూమపాన నిషేధం'పై కేంద్రం ఇదే చట్టాన్ని నమూనా కింద స్వీకరించింది. ఆనాటినుంచీ పొగాకుపై మా సమష్టి పోరులో మేం సుదీర్ఘ ప్రయాణం చేశాం. పొగాకు వినియోగం తగ్గించడంలో భాగంగా దానికి సంబంధించిన ప్రచారం, ప్రకటనలను నియంత్రిస్తూ మేం అనేక చట్టాలు చేశాం. అలాగే పొగాకు నియంత్రణపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ముసాయిదా చట్రాన్ని తొలుత ఆమోదించిన దేశాల్లో భారత్ కూడా ఒకటని ఈ సందర్భంగా నేను సగర్వంగా ప్రకటిస్తున్నాను. భారతదేశానికి ప్రత్యేకంగా 'జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం' ఉంది. దీనికి అనుగుణంగా గడచిన ఏడేళ్లలో మా ప్రభుత్వం బలమైన రాజకీయ సంకల్పం, సమష్టి కృషితో చేపట్టిన లక్ష్య నిర్దేశిత చర్యలు పొగాకు నియంత్రణలో గణనీయ విజయాలను సాధించాయి. ఆ మేరకు పొగాకు ఉత్పత్తుల పాకెట్లపై 85శాతం భాగాన్ని పెద్ద హెచ్చరికలతో ముద్రించేలా చర్యలు తీసుకున్నాం. అదేవిధంగా పొగాకు ఉత్పత్తుల వాడకం మానడం కోసం ప్రజలకు తోడ్పాటునిచ్చేందుకు సహాయ కేంద్రం ఏర్పాటు చేశాం. ఎలక్ట్రానిక్ సిగరెట్లు, వాటిని పోలిన పరికరాలను నిషేధించే చట్టం ద్వారా 'ఈ-సిగరెట్ల' బెడదను తొలగించాం. చలనచిత్రాలు, టీవీ కార్యక్రమాలలో పొగాకు ఉత్పత్తుల ప్రదర్శన, వినియోగం సంబంధిత దృశ్యాలను నియంత్రణ పరిధిలోకి తెచ్చాం. మేం చేపట్టిన ప్రధాన చర్యలలో ఇవి కొన్ని కాగా, వీటితోపాటు అవగాహన కల్పించడం ద్వారా పొగాకు నియంత్రణను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాం.

పొగాకు నియంత్రణ కార్యక్రమాన్ని ఒక ఆదర్శ కర్తవ్యంలా, సామాజిక ఉద్యమం తరహాలో కొనసాగించాలి. మానవాళికి ఎంతోకొంత విలువైన సేవద్వారా గుర్తింపు పొందే, మన జీవితాలకు అర్థం కల్పించే ఒక పవిత్ర లక్ష్యంతో ముందడుగు వేయాలి. పొగాకు రహిత సమాజం దిశగా కృషిలో నావంతు తోడ్పాటుకు గుర్తింపుగా 1998లో ఇదే రోజున ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతిష్టాత్మక 'డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ ప్రశంస పతకం' ప్రదానం చేయడాన్ని నేను సగర్వంగా, సవినయంగా గుర్తు చేసుకుంటున్నాను. పొగాకు నియంత్రణ కర్తవ్యంలో భాగంగా యువతకు తీవ్ర హానిచేస్తున్న 'ఈ-సిగరెట్లు', ఆ తరహా ఉత్పత్తుల నిషేధం కోసం 2019లో జాతీయస్థాయి చట్టం రూపొందించడంలో నా కృషికి గుర్తింపునిస్తూ ఈ సంవత్సరమే ప్రపంచ ఆరోగ్య సంస్థ నాకు 'డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ ప్రత్యేక పురస్కారం' ప్రదానం చేసింది. గడచిన మూడు దశాబ్దాలుగా శక్తివంచన లేకుండా పొగాకుపై పోరాటంలో నేను ప్రదర్శిస్తున్న ఉత్సాహాన్ని ఎత్తిచూపడానికే ఈ సమాచారాన్ని మీతో పంచుకుంటున్నాను. అంతేకాకుండా ఇవాళ ఈ సదస్సుకు హాజరైన పొగాకు నియంత్రణ ఉద్యమ విశిష్ట దూతలు ఇదే స్ఫూర్తితో మరింత ముందడుగు వేయడంలో ఇది ఉత్తేజమిస్తుందని భావిస్తున్నాను. పొగాకు నియంత్రణ పోరాటంలో మనం పరిశుద్ధ కర్తవ్య నిబద్ధతతో ముందుకు వెళ్తున్నాం కాబట్టి నైతికంగా మనం రుజుమార్గంలో ఉన్నట్లేనన్న వాస్తవాన్ని గుర్తుచేసుకుందాం. పొగాకు వాడకంపై యువతలో విముఖత పెంచే దిశగా ఈ సమాజంలో మనం ఎంతగానో కృషి చేయవచ్చు. పొగాకు వాడకం, నికోటిన్ స్వీకరించడంవల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి అవగాహన కల్పించే బాధ్యతను పాఠశాలలు స్వీకరించవచ్చు. తదనుగుణంగా విద్యార్థులకు సమాచార వనరులు సమకూర్చడంతోపాటు తమ ప్రాంగణాలను పొగాకు, ఎలక్ట్రానిక్ నికోటిన్ నింపిన పరికరాల (ఇఔఆ) రహితం చేయవచ్చు. పొగాకు వాడకంతో కలిగే అనేక అనర్థాలుసహా వ్యక్తిగత ఆర్థికస్థితిపై వాటి దుష్ప్రభావంపై యువతను చైతన్యం చేయడానికి యువజన బృందాలు స్థానికంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించవచ్చు. పొగాకు లేదా ఈ-సిగరెట్ల వాడకాన్ని సూచించే దృశ్యాలు లేకుండా చలనచిత్ర, టెలివిజన్, నాటక నిర్మాణ సంస్థలు స్వీయ కట్టుబాటును విధించుకోవచ్చు. అలాగే నికోటిన్, పొగాకు సంబంధిత పరిశ్రమల ప్రాయోజితాలతోపాటు 'బ్రాండ్ అంబాసిడర్‌షిప్' వంటి ఆఫర్లను ప్రముఖులు, సమాజాన్ని ప్రభావితం చేయగల వ్యక్తులు తిరస్కరించవచ్చు.సుదీర్ఘ పొగాకు వినియోగం కారణంగా నవ యువకులు అకాల మరణం పాలవడం చూసినప్పుడు గుండె తరుక్కుపోతుంది. ఈ నేపథ్యంలో పొగాకు నియంత్రణ చర్యలు, విధానం లేదా చట్టాన్ని పలచబరిచే లేదా బలహీనం చేసే ప్రయత్నాలపై ఆగ్రహావేశాలు ప్రజానీకం నుంచి బహిరంగ నిరసనకు దారితీసేలా చూడాలన్నది నా ఆకాంక్ష. సమష్టి పోరాటంతో మనం ఈ యుద్ధంలో చారిత్రక విజయం సాధించి చరిత్ర సృష్టించడం తథ్యమడంలో నాకెలాంటి సందేహం లేదు. ఈ దిశగా అత్యున్నత వివేచనతో, కర్తవ్య నిబద్ధతతో మన వంతు పాత్రను పోషించాల్సి ఉంది. ఈ మేరకు పొగాకురహిత ఆరోగ్యకర ప్రపంచం లక్ష్యంగా మనం ఇవాళ సంకల్పం పూనుదాం రండి. పొగాకు నియంత్రణ నాయకత్వాన్ని ముందుకు తీసుకెళ్లడంలో భారత్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నదని ఈ సందర్భంగా భరోసా ఇస్తున్నాను. ఈ కీలక సందర్భంలో నాకు అవకాశమిచ్చి ఇందులో భాగస్వామిని చేసినందుకు మీకందరికీ ధన్యవాదాలు. పొగాకు నియంత్రణ లక్ష్య సాధనకు అంకితభావంతో మీరు చేస్తున్న ప్రయత్నంలో ఘన విజయం సిద్ధించాలని ఆకాంక్షిస్తున్నాను."

# గవర్నర్‌ను కలిసిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు



హైదరాబాద్ , జూన్ 25: గవర్నర్ తమిళసైను తెలంగాణ కాంగ్రెస్ నేతలు శుక్రవారం కలిశారు. రాచకొండ పరిధిలో లాకప్‌డెత్‌పై గవర్నర్‌కు కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. అనంతరం సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణలో రాజ్యాంగపరమైన స్వేచ్ఛ లేదని మండిపడ్డారు. మరియమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, దళితులపై జరుగుతున్న దాడులపై గవర్నర్‌కు వివరించామని తెలిపారు. తెలంగాణలో పోలీసులకు, టీఆర్ఎస్ నేతలకు తేడా లేదని వ్యాఖ్యానించారు. పోలీసులు.. టీఆర్ఎస్ పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఆచరణలో లేదని శ్రీధర్‌బాబు ధ్వజమెత్తారు.

# సీఎం కేసీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



జయశంకర్ భూపాలపల్లి, జూన్ 25: : అపర భగీరథుడు కాళేశ్వరం ప్రాజెక్ట్ రూపకర్త సీఎం కేసీఆర్ విగ్రహ ఏర్పాటుకు అంకురార్పణ మొదలైంది. జిల్లాలోని మహాదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామ పరిధిలో కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ (లక్ష్మి బరాజ్) వద్ద సీఎం కేసీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షినితో కలిసి పరిశీలించారు. త్వరలోనే విగ్రహ ఏర్పాటు కార్యక్రమాలను ప్రారంభిస్తామని వారు తెలిపారు.

# నారా లోకేష్‌ను కలిసిన వైసీపీ నేత



కడప జిల్లా, జూన్ 25:: రాయచోటి మాజీ ఎమ్మెల్యే మండిపల్లి నాగిరెడ్డి తనయుడు ప్రస్తుత వైసీపీ నేత, మాజీ పీసీసీ సభ్యుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం నాడు హైదరాబాద్‌లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని నారా లోకేష్ నివాసానికి వెళ్లి లోకేష్ రాంప్రసాద్ రెడ్డి భేటీ అయ్యారు. త్వరలో రాంప్రసాద్ రెడ్డి అధికార పార్టీ వైసీపీని వీడి టీడీపీలో చేరనున్న నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యత సంచరించుకుంది. రాయచోటి నియోజకవర్గంలో టీడీపీ బలోపేతంపై రాంప్రసాద్ రెడ్డితో లోకేష్ చర్చించినట్లు సమాచారం.

# ఉపాధ్యాయుడు ప్రకాశ్ కు ఘన నివాళులు

రాజన్న సిరిసిల్ల, జూన్ 25(నేటినిజం ప్రతినిధి): ఇటీవల కరోనాతో మరణించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు గుమ్మడి ప్రకాశ్ కు చందుర్తి మండల విద్యావనరుల కేంద్రంలో మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు శుక్రవారం ఘన నివాళులు అర్పించారు, ఈ సందర్భంగాప్రధానోపాధ్యాయులు వికృతి లక్ష్మీనారాయణ మాట్లాడుతూప్రకాష్ ఉద్యోగం పొందినప్పటి నుండి సుమారు పదిహేను సంవత్సరాలు ఉపాధ్యాయులుగా కొనసాగుతూ ఎంతోమంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాదన్నారు,ఎంఆర్పి గా కూడా మండల విద్యావనరుల కేంద్రలో సేవలు అందించారని గుర్తు చేశారు, ప్రకాష్ మరణం విద్యాశాఖకు తీరని లోటన్నారు,ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు కటుకూరి ముఖేష్,కోరెపు శ్రీనివాస్, వంగతిరుపతి,సంజీవ్,శ్రీనివాస చారి,కడారినరేస్,యాదగిరి, పురుషోత్తం, రామస్వామి, బండి యాదగిరి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు,



# మరియమ్మ కుటుంబానికి ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి

## –బాధితులను పరామర్శించిన బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్



రాజన్న సిరిసిల్ల, జూన్ 25(నేటినిజం ప్రతినిధి): చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన దళిత మహిళ మరియమ్మ మృతిపై విచారణ జరిపి బాధితులపై చర్యలు తీసుకోవాలని దళిత మహిళ మరియమ్మ కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియాను తక్షణమే ప్రకటించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని,హత్యకు పాల్పడిన వారిపై ఎస్సి,ఎస్టీ అట్రాసిటీ కేసు, హత్యానేరం కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మంలోని హాస్పిటల్లో చికిత్స పొందుతున్న మరి యమ్మ కుమారుడు ఉదయ్ కిరణ్ ను బిజెపి నాయకులతో కలిసి బీజేపీ రాష్ట్ర దళిత మోర్చాప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ పరామర్శించారు.అనంతరం కుమ్మరి శంకర్ మాట్లాడుతూ దళితులపైన జరుగుతున్న దాడులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మరియమ్మ గత కొద్ది రోజుల క్రితం అడ్డగూడూరు హత్య చేయడందుర్మార్గమని,అంతటితో ఆగకుండా ఆమెకుమారుడైన ఉదయ్ కిరణ్ ని వెన్నుముక కింది భాగంలో దారుణంగా కుల్లపొడిచి అవయవాల పైన గాయపర్చి హత్యాయత్నం చేయడంశోచనీయమన్నారు.మరియమ్మ హత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించి,ఆమె కుటుంబాన్ని వెంటనే ఆదుకోవాలన్నారు. మరియమ్మ మృతి పట్ల విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# ఈడీ ముందుకు టీఆర్ఎస్ ఎంపీ నామా.. రూ.264 కోట్ల స్కాంపై విచారణ

హైదరాబాద్ , జూన్ 25:జార్ఖండ్‌లో మధుకాన్ కంపెనీ చేపట్టిన నేషనల్ హైవే ప్రాజెక్టు కోసం తీసుకున్న బ్యాంకు రుణాలను పక్కదారి పట్టించారని ఆరోపణలపై టీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు ఇవాళ ఈడీ ఎదుట విచారణకు హాజరు కానున్నారు. మధుకాన్ కంపెనీ రూ. 264 కోట్ల స్కాం లో ఈడి నోటీసులు ఇచ్చింది. నేడు విచారణకు హాజరు కావాలని నామతో పాటు కంపెనీ డైరెక్టర్లకు ఈడి సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఎంపీ నామా విచారణకు హాజరు కానున్నారు. ఈడీ విచారణకు తాను సహకరిస్తానని నామా ఇప్పటికే ప్రకటించారు.

జార్ఖండ్‌లో మధుకాన్ కంపెనీ చేపట్టిన నేషనల్ హైవే ప్రాజెక్టు కోసం తీసుకున్న బ్యాంకు రుణాలను పక్కదారి పట్టించారని టీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. 2011లో జార్ఖండ్‌లో రాంచీ? జంషెడ్‌పూర్ మధ్య 163 కిలోమీటర్ల పొడవైన నేషనల్ హైవే పనులను మధుకాన్ కంపెనీ దక్కించుకుంది. రూ.1,151 కోట్ల వ్యయంతో బిల్డ్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో చేజిక్కించుకుంది. ఇందుకోసం స్పెషల్ పర్పస్ వెహికల్ కింద రాంచీ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. మధుకాన్ సంస్థ ప్రభుత్వం నుంచి దక్కించుకున్న టెండర్‌ను చూపించి.. కెనరా బ్యాంకు ఆధ్వర్యంలోని బ్యాంకుల కన్సార్షియం నుంచి రూ.1,029.39 కోట్లు పొందింది. తర్వాత మధుకాన్ సంస్థ అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో.. విచారించాలని సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ) న్యూఢిల్లీని జార్ఖండ్ హైకోర్టు ఆదేశించింది. ఎస్ఎఫ్ఐఓ దర్యాప్తు చేసి.. మధుకాన్ తీసుకున్న రుణంలోంచి రూ.264.01 కోట్లు పక్కదారి పట్టినట్టు నివేదిక ఇచ్చింది. ఈ అంశంలో సీబీఐ కూడా దర్యాప్తు చేపట్టింది.

మధుకాన్ గ్రూపుతోపాటు పలు ఇతర కంపెనీలపై కేసు నమోదు చేసింది. ఈ కేసులో భారీగా నిధులు అక్రమంగా విదేశాలకు తరలించారన్న ఆరోపణలతో మనీల్యాండరింగ్ చట్టం కింద ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. అందులో భాగంగానే సీబీఐ అధికారులు నామా ఇంట్లో,కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. ఈ కేసుకు సంబంధించి నామా జూన్ 25న ఈడీ ఎదుట విచారణకు హాజరు కావాలిన ఈటీ నోటిసులు పంపిన సంగతి తెలిసిందే.

# రామప్పకు యునెస్కో గుర్తింపు ఇవ్వాలి



హన్మకొండ, జూన్ 25 : యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో ములుగు జిల్లా పాలంపేట గ్రామంలో ఉన్న రామప్ప ఆలయానికి చోటు కల్పించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం కోరింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ టూరిజం, కల్చరల్, యువజన సర్వీసులు, క్రీడ లు, పురావస్తు శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌తో కూడిన బృందం గురువారం ఢిల్లీలోని శాస్త్రీభవన్‌లో సాంస్కృతిక, పర్యాటక మం త్రిత్వ శాఖ అధికారులు, భారత పురావస్తు సర్వే డైరెక్టర్ జనరల్‌ను కలిశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక మంత్రిత్వ శాఖలో రాష్ట్రానికి సంబంధించి పెండింగ్ నిధుల మంజూరుపై బృందం ప్రతినిధులు చర్చించారు. రాష్ట్రంలోని స్మారక చిహ్నాలు, కోటల అభివృద్ధి పనులు చేపట్టాలని, వరంగల్, కరీంనగర్‌లోని మ్యూజియాల ఆధునీకరణకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను కోరారు. రామప్ప, వేయిస్తంభాల దేవాలయాల పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా మం త్రులు మాట్లాడుతూ ప్రపంచ పటంలో రాష్ట్ర వైభవాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు సీఎం కేసీఆర్ చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రతినిధి బృందం లో ఎంపీలు డాక్టర్ బండా ప్రకాశ్, పసునూరి దయాకర్, మాలోత్ కవిత, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి శ్రీనివాస్‌రాజు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కార్యదర్శి ప్రొఫెసర్ పాండురంగారావు, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డీజీ విద్యావతి ఉన్నారు.

# ఏపీలో పరిషత్ ఎన్నికలపై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై స్టే

అమరావతి, జూన్ 25:ఏపీలో నిర్వహించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రద్దు చేసి రీనోటిఫికేషన్ ఇవ్వాలంటూ సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే ఇచ్చింది. ఎస్ఈసీ దాఖలు చేసిన రిట్ పిటిషన్ పై ఏపీ హైకోర్టు డివిజన్ బెంచ్ శుక్రవారం విచారణ జరిపింది. పరిషత్ ఎన్నికల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాల్సి ఉందని డివిజన్ బెంచ్ అభిప్రాయపడింది. తుది తీర్పు వచ్చేవరకు ఓట్ల లెక్కింపు చేపట్టరాదని స్పష్టం చేసింది. తదుపరి విచారణను జులై 27కి వాయిదా వేస్తున్నట్టు తెలిపింది.కాగా, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పూర్తి అయినప్పటికీ ఇప్పటి వరకు ఫలితాలు ప్రకటించలేదు. సుప్రీం కోర్టు మార్గదర్శక సూత్రాలను పాటించలేదనే కారణంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రద్దు చేసి, మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలంటూ హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే, దీనిపై ఎస్ఈసీ హైకోర్టు డివిజన్ బెంచ్ ను ఆశ్రయించింది. ఈ క్రమంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే ఇచ్చింది.

# ప్రధానమంత్రి ఊహించిన విధంగా 2025 నాటికి భారతదేశం టిబిని నిర్మూలించగలదు : డాక్టర్ హర్ష వర్ధన్

న్యూఢిల్లీ, జూన్ 25:గౌరవనీయులు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ హర్ష వర్ధన్ ఈ రోజు ఇక్కడ నుండి దృశ్య మాధ్యమం ద్వారా, ఆరోగ్య మంత్రిత్వ శాఖ యొక్క వివిధ అభివృద్ధి భాగస్వాములతో క్షయ వ్యాధి (టి.బి) ముక్త భారత్ సమావేశానికి అధ్యక్షత వహించారు. టి.బి. కి వ్యతిరేకంగా పోరాటంలో పురోగతిని సమీక్షించడం కోసం కేంద్ర ఆరోగ్య మంత్రి అధ్యక్షతన జరిగిన 4వ సమావేశం ఇది.

ఈ సమావేశంలో డాక్టర్ హర్ష వర్ధన్ మాట్లాడుతూ, దేశంలో పోలియో నిర్మూలనలో మీడియా, ముఖ్యంగా దూరదర్శన్ కీలక పాత్ర పోషించిందని అన్నారు.

ఇదే తరహాలో, ప్రజలలో అవగాహన కల్పించడానికి జర్నలిస్టులు మరియు మీడియా ప్రముఖులను టి.బి. యోధులుగా పనిచేయాలని ఆయన కోరారు. టి.బి. కి వ్యతిరేకంగా పోరాటంలో ఉపయోగించిన ఉత్తమ పద్ధతులు, అనుభవాలు మరియు ఆలోచనలను పంచుకోవడానికి సంస్థాగత యంత్రాంగాన్ని అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని, ఆయన, పేర్కొన్నారు. నాయకత్వం మరియు సమాజ ప్రమేయం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు.

మత పెద్దలు, ఆటో యూనియన్ల నాయకులు మొదలైనవారు కూడా టి.బి. కి వ్యతిరేకంగా అవగాహన కల్పించగలరని, ఆయన ప్రతిపాదించారు.

ఎక్కువగా టి.బి. కేసుల భారం ఉన్న 5 రాష్ట్రాలకు అనువైన నమూనాలను, స్పష్టమైన వ్యూహాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కూడా ఆయన తెలిపారు. ఈ రాష్ట్రాలు ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, మేఘాలయ, హిమాచల్ ప్రదేశ్ మరియు తెలంగాణ.

వివిధ అభివృద్ధి భాగస్వాములు చేస్తున్న ప్రయత్నాలపై డాక్టర్ హర్ష వర్ధన్ సంతృప్తి వ్యక్తంచేస్తూ, "మనందరం కలిసి సరైన దిశలో పయనిస్తున్నాము" అని పేర్కొన్నారు. కోవిడ్ మరియు టి.బికి వ్యతిరేకంగా చేయి, చేయి కలిపి పోరాటం చేయాలని, ఆయన సూచించారు.

టి.బి. ని తొలగించడానికి మన మనస్సు, హృదయం మరియు ఆత్మల ను కలిపి ఉంచినట్లయితే, గౌరవ ప్రధానమంత్రి ఊహించిన విధంగా 2025 నాటికి భారతదేశం టి.బి. ని నిర్మూలించగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

టి.బి కి వ్యతిరేకంగా చేసిన పోరాటంలో దేశం సాధించిన పురోగతిపై, ఎం.ఓ.హెచ్.ఎఫ్.డబ్ల్యు. శాఖ సహాయ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే సంతృప్తి వ్యక్తం చేస్తూ, టి.బి. ని నిర్మూలించడానికి జన్ ఆందోళన్ చేపట్టవలసిన అవసరం ఉందని, అన్నారు. గ్రామాలు, మురికివాడలలో ప్రజలకు సహాయపడటానికి వీలుగా అన్ని రకాల పరీక్షా యంత్రాలు మరియు ఇతర సేవలతో, క్షేత్ర స్థాయి సందర్శనల అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

టి.బి. కి వ్యతిరేకంగా పోరాటంలో కార్పొరేట్ రంగం, సమాజం పాల్గొనవలసిన అవసరం ఉందని, ఎమ్.ఓ.హెచ్.ఎఫ్.డబ్ల్యు. కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. అధిక టి.బి. కేసుల భారం ఉన్న రాష్ట్రాల్లో టి.బి. కి కూడా కోవిడ్ కు అనుసరించిన టీకా వ్యూహం ప్రకారం, సూక్ష్మ ప్రణాళికను అమలుచేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ మరియు అభివృద్ధి భాగస్వాముల మధ్య చురుకైన సహకారం అవసరమని, ఆయన నొక్కి చెప్పారు.

మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు, భారతదేశంలో డబ్ల్యు.హెచ్.ఓ. ప్రతినిధి, వివిధ అభివృద్ధి భాగస్వాముల ప్రతినిధులు, ఎన్.జి.ఓ. లతో పాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

# డెల్టా ప్లస్ వేరియంట్‌కి వ్యాక్సిన్ పని చేస్తుందా?

న్యూఢిల్లీ, జూన్ 25:దేశంలో కరోనా వైరస్ క్రమంగా తగ్గుతుండగా.. కొత్తగా డెల్టా ప్లస్ వేరియంట్ భయాందోళనలు కలిగిస్తోంది. డెల్టా ప్లస్ కారణంగా ఇప్పటికే తొలి మరణం సంభవించగా.. కేసులు సంఖ్య పేరుతోంది. కరోనా సెకండ్ కారణంగా విలవిలలాడిన భారత్‌లో జనజీవనం స్తంభించింది. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్తంగా కరోనా కేసులు తగ్గుముఖం పడుతుండడంతో చాలా రాష్ట్రాలు లాక్ డౌన్ ను ఎత్తివేశాయి. కరోనా థర్డ్ వేవ్ ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్న తరుణంలో ఇప్పుడు డెల్టా ప్లస్ ఆందోళన కలిగిస్తోంది. కరోనా వ్యాక్సిన్లు అందుబాటులోకి రావడంతో వైరస్ నుంచి పూర్తిగా బయటపడొచ్చన్న ఆశలపై.. మహమ్మారి కొత్త వేరియంట్లు నీళ్లు చల్లుతున్నాయి.

కరోనా సెకండ్ వేవ్ కు కారణమైన డెల్టా వేరియంట్ రూపాంతరం చెంది డెల్టా ప్లస్ గా మారినట్లు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే . ప్రస్తుతం దేశంలో 40కిపైగా డెల్టా ప్లస్ కేసులు నమోదు అయ్యాయి. మహారాష్ట్ర , కేరళ , మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ కేసులు ఎక్కువగా నమోదు కాగా .. కర్ణాటక , తమిళనాడు, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాల్లోనూ కేసులు మొదలయ్యాయి. ఈ డెల్టా ప్లస్ ను గుర్తించిన వారిలో తొలిసారిగా మధ్యప్రదేశ్ లోని ఓ మహిళా చనిపోయింది. అయితే, ఆ మహిళ ఎటువంటి వ్యాక్సిన్ తీసుకోకపోవడంతో వైరస్ ప్రభావం ఎక్కువగా ఉందని డాక్టర్లు చెప్పారు . ఇక ఈ కొత్త వేరియంట్ ప్రమాదకరమయ్యే అవకాశం ఉందన్న అంచనాలతో కేంద్ర ప్రభుత్వం దీన్ని వేరియంట్ ఆఫ్ కన్సర్న్ గా ప్రకటించింది.

మరోవైపు ఈ డెల్టా ప్లస్ వేరియంట్ మరింత శక్తివంతమని , వేగంగా వ్యాప్తి చెందుతుందని నిపుణుల , శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. డెల్టా ప్లస్ వేరియంట్ సోకిన వారి పక్క నుంచి మాస్కు పెట్టుకోకుండా వెళ్లినా కూడా వైరస్ సోకే అవకాశం ఉందని ఆలిండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ( ఎయిమ్స్ ) డైరెక్టర్ రణ్ దీప్ గులేరియా ఇటీవల వెల్లడించారు. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా కొత్త వేరియంట్ సోకుందని హెచ్చరించారు . మాస్కులు , శానిటైజేషన్ , భౌతిక దూరం వంటి కరోనా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ డెల్టా ప్లస్ వేరియంట్ మోనోక్లోనల్ యాంటీబాడీస్ ఔషధాన్ని తట్టుకుంటుందని , రోగ నిరోధక వ్యవస్థ నుంచి తప్పించుకుంటుందన్న అంచనాలు ఉన్నాయని తెలిపారు. రానున్న ఆరు నుంచి ఎనిమిది వారాలు అత్యంత కీలకమన్నారు.

దేశంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న కోవిషీల్డ్ , కోవార్టిన్ టీకాలు డెల్టా రూపాంతరితం నుంచి కూడా రక్షణ కల్పిస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి. కానీ డెల్టా ప్లస్ విషయంలో టీకాల సమర్థత ఎంత అన్నది ఇంకా తేలలేదు. టీకా ఒక డోసు తీసుకున్న తర్వాత కొందరు వైరస్ బారిన పడటాన్ని బట్టి చూస్తే కొత్త రూపాంతరితాలపై టీకా ప్రభావం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయని కొందరు నిపుణులు చెబుతున్నారు. కరోనా వ్యాక్సిన్ సింగిల్ లేదా డబుల్ డోసు తీసుకున్న ముగ్గురు ఈ వేరియంట్ బారినపడినప్పటికీ కోలుకున్నారని వైద్యులు వెల్లడించారు.

ఇది ఇలా ఉంటే.. కరోనా డెల్టా ప్లస్ వేరియంట్ కారణంగా దేశంలో థర్డ్ వేవ్ ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డెల్టా ప్లస్ వేరియంట్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. కరోనా వ్యాప్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆంక్షలను కొనసాగించాలని ఆదేశించింది.

# తెలుగు రాష్ట్రాల మధ్య మళ్లీ జల జగడం

హైదరాబాద్ , జూన్ 25:తెలుగు రాష్ట్రాల మధ్య జల జగడం మళ్లీ ముదురుతోంది. జల వివాదం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అగ్గిపుట్టిస్తోంది. ఇరు రాష్ట్రాలకు చెందిన నాయకులు మాటల తూటాలు పేల్చుతున్నారు. కృష్ణా బేసిన్‌లో వివాదం నెలకొంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లా సరిహద్దుల్లో ఉన్న ఆర్డీఎస్ కుడి కాలువ పనులతో రెండు రాష్ట్రాల మధ్య మళ్లీ నీళ్లు అగ్గి రాజేశాయి. దీంతో ఏపీ, తెలంగాణ మధ్య ఘర్షణ మళ్లీ మొదటికొచ్చాయి. ఏపీ చేపడుతున్న రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంతో పాటు ఆర్డీఎస్ విస్తరణను తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇటీవల తెలంగాణ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయాలను వేడెక్కించాయి. ఏపీ ప్రభుత్వం అక్రమ ప్రాజెక్టుకులు కదుతోందంటూ ఆయన చేసిన కామెంట్స్ కాక పట్టించింది. దీనిపై ఏపీ నేతలు కూడా కౌంటర్ ఇస్తున్నారు.

కృష్ణా నదిపై ఏపీ నిర్మిస్తున్న ప్రాజెక్టులపై తెలంగాణ ప్రభుత్వం దూకుడుగానే వ్యవహరిస్తోంది. రాయలసీమ ఎత్తిపోతల, పోతిరెడ్డిపాడు విస్తరణపై ఎన్‌జీటీ స్టే విధించినా పనులు కొనసాగుతున్నాయంటూ కృష్ణా బోర్డుకు లేఖ రాసింది. ఏపీ చర్యలతో కరువుకు తోడు ఫ్లోరైడ్ ప్రాంతాలపై ప్రభావం పడుతుందని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేసేలా మళ్లీ ఆదేశాలు జారీ చేయాలంటూ జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ)లో తాజాగా మరో దరఖాస్తు దాఖలైంది. ఎన్జీటీ ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా బాధ్యులైన అధికారులందరిపైనా చర్య తీసుకోవడంతోపాటు, పర్యావరణ అనుమతి లేకుండా పనులు చేస్తుండటంపై కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు తగు ఆదేశాలు చేయాలని తాజాగా కోరారు. గతంలో ఎన్జీటీని ఆశ్రయించిన జి.శ్రీనివాస్ మళ్లీ దరఖాస్తు దాఖలు చేయగా, తెలంగాణ నీటిపారుదల శాఖ కూడా శుక్రవారం ఎన్జీటీకి వెళ్లనున్నట్లు తెలిసింది.

కృష్ణా నదీ జలాలపై వివాదం చాలాకాలంగా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మనుగడలో ఉండగా ఇది మూడు రాష్ట్రాల సమస్యగా ఉండేది. ప్రస్తుతం అది మహారాష్ట్ర, కర్ణాటకతో పాటుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య వివాదంగా మారింది. తెలంగాణ ఉద్యమం సాగిందే నీళ్ల చుట్టూ. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు దారితీసిన అంశాల్లో నీళ్లే ప్రధాన ఎజెండా. పోరాడి సాధించుకున్న తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లకే పెద్దపీట వేసింది. గోదావరిపై ప్రతిష్ఠాత్మక కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. కోటి ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. అయితే, కృష్ణాకు సంబంధించి నీటి యుద్ధం మొదలైంది. రాయలసీమ ఎత్తిపోతల పథకం, ఆర్డీఎస్ లపై తెలంగాణ మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాట్‌టాఫిక్‌గా మారాయి. ఉమ్మడి రాష్ట్రంలో నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుత ఏపీ సీఎం వైఎస్ జగన్ టార్గెట్‌గా సంచలన వ్యాఖ్యలు చేశారు. కొత్త ప్రాజెక్ట్‌లు కట్టడం లేదని గ్రీన్‌ట్రిబ్యునల్‌కు చెప్పి దొంగతనంగా నిర్మిస్తున్నారని ఆరోపించారు. అంతేకాదు బీజేపీ, కాంగ్రెస్ నేతలపై కూడా తీవ్ర విమర్శలు చేశారు.

తెలంగాణ ప్రతిపక్ష పార్టీల నేతలు సైతం తీవ్రంగా స్పందించారు. ఏపీ అక్రమ ప్రాజెక్టులపై తెలంగాణ మంత్రులేం చేస్తున్నారని కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రశ్నించారు. బేసిన్లు లేవు.. బేషజాలు లేవన్న సీఎం కేసీఆర్.. ఏపీ అక్రమ ప్రాజెక్టులపై ఇప్పుడేమంటారని ఎదురు దాడికి దిగారు. ఏపీ అక్రమ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోలేకపోయిందని బీజేపీ నాయకురాలు డీకే అరుణ నిప్పులు చెరిగారు.

తెలంగాణ మంత్రి వేముల వ్యాఖ్యలపై ఏపీ నేతలు సైతం ఘాటుగా స్పందించారు. కృష్ణా నదిపై నిర్మిస్తున్న పాలమూరు రంగారెడ్డి, డిండి, కల్వకుర్తి, నెట్టెంపాడు ప్రాజెక్టులకు అనుమతులెక్కడివని ప్రశ్నించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు తెలంగాణ అభ్యంతరం చెప్పడాన్ని ఖండించారు. ఏపీ ప్రజలు రాక్షసులా, ఎవరిపై యుద్ధం చేస్తారని ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు ప్రశ్నించారు. రాయలసీమ ప్రయోజనాలకు నష్టం వాటిల్లితే చూస్తూ ఊరుకోబోమంటూ సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారు.

మరోవైపు కొందరు తెలంగాణ నేతలు విద్వేషాలు పెంచేలా మాట్లాడుతున్నారని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆవేశంతో, పరుషంగా మాట్లాడడం వల్ల ఏ సమస్యా పరిష్కారం కాదని హితవు పలికారు. తెలంగాణ నేతలు మాట్లాడే మాటలను వారి విచక్షణకే వదిలేస్తున్నామని తెలిపారు. మొత్తం మీద ఈ జల జగడం తెలుగు రాష్ట్రాల మధ్య కొత్త యుద్ధం సృష్టించే అవకాశం ఉంది.

# ఏపీ తీరుపై నిప్పులు చెరిగిన మంత్రి నిరంజన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 25:: ఆంధ్రప్రదేశ్ జలదోపిడీ, కృష్ణానది పరివాహక ప్రాంతంలో అక్రమ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో ఏపీ తీరును రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలో నిర్మించిన రైతు వేదికను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రయోజనాల విషయంలో నాడు కాంగ్రెస్, నేడు బీజేపీ నేతలది సైంధవ పాత్ర అన్నారు. హక్కు లేకుండా అక్రమంగా ప్రాజెక్టులు నిర్మిస్తామంటే పాతరేస్తాం. దాదాగిరీ, గూండాగిరి నడవనివ్వం. ఇప్పుడు మాదొక రాష్ట్రం. మా హక్కులకు విరుద్ధంగా కృష్ణా బేసిన్‌లో దోసెడు నీళ్లను కూడా తీసుకోనివ్వం. కృష్ణా నది నుండి తెలంగాణకు హక్కుగా వచ్చే ప్రతి నీటి చుక్కను వినియోగించుకుంటాం. వెన్నెముకలేని బానిస నేతల మూలంగానే గతంలో తెలంగాణకు అన్యాయం జరిగింది. ఏపీ జలదోపిడీని ఎట్టి పరిస్థితులలో అడ్డుకుని తీరుతాం. తెలంగాణ ప్రయోజనాల కోసం ఎంత దూరమైనా వెళ్తాం.సమైక్యపాలనలో ఆంధ్రా జలదోపిడీకి మద్దతుగా హారతులు పట్టినోళ్లు.., దొంగ ప్రాజెక్టులకు సద్దులు మోసిన ఇంటి దొంగలు ఇప్పుడు తెలంగాణకు అన్యాయం జరిగిందని హాహాకారాలు చేస్తున్నరు. తెలంగాణ ఉద్యమమే నదీజలాలు, సాగునీటి హక్కుల కోసం. కృష్ణాజలాలలో తెలంగాణ నీటి వాటా తేల్చకుండా కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులుగా మీరున్నారు. పాలితులుగా తెలంగాణ ప్రజలున్నారు. అప్పుడు ఇక్కడి నాయకత్వం మీకు పదవుల కోసం బానిసలుగా మారడంతో అక్రమ ప్రాజెక్టులను కట్టగలిగారు. అసలు ప్రాజెక్టులు కట్టుకునేందుకు ఏపీకి శాశ్వత నీటి కేటాయింపులు ఎక్కడివి ?



ఆంధ్రా జలదోపిడీని అడ్డుకుంటాం..

ఇప్పుడు తెలంగాణ ఒక ప్రత్యేక రాష్ట్రం .. ఆంధ్రా జలదోపిడీని అడ్డుకుంటాం .. ఈ దేశంలో రాజ్యాంగం అమలులో ఉందన్న విషయం ఏపీ ప్రభుత్వం గుర్తించాలి. నీటి కేటాయింపులు జరిగాక, అన్ని రకాల అనుమతులు వచ్చాకనే రాయలసీమ ఎత్తిపోతల పథకం ప్రారంభిస్తాం అని ఏపీ ప్రభుత్వం రాతపూర్వకంగా రాసిచ్చారు. ఏపి ప్రభుత్వ చర్యలు రాజ్యాంగ వ్యతిరేకం, చట్టవ్యతిరేకం, విభజన చట్టంలోని నిబంధనలకు వ్యతిరేకం, సహజ న్యాయసూత్రాలకు వ్యతిరేకం. కేంద్రప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి .. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కు నిర్ణీత కాలగడువు విధించి కృష్ణా జలాలలో తెలంగాణ, ఆంధ్రా నీటివాటాలు తేల్చాలి

స్నేహ హస్తం అందిస్తే.. మిత్ర ద్రోహమే మిగిలింది..

వృధాగా పోతున్న గోదావరి జలాలను సద్వినియోగం చేసుకుందామని ముఖ్యమంత్రి కేసీఆర్, ఏపీ ముఖ్యమంత్రి జగన్‌కు స్నేహ హస్తం అందించారు. కేసీఆర్ దూరదృష్టితో చేసిన సూచనలను వదిలేసి కృష్ణా జలాలను అన్యాయంగా తీసుకుపోతామనడం మిత్ర ద్రోహమే. రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడడంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి గర్హనీయం. ఆయా రాష్ట్రాల సహజ వనరులు సద్వినియోగం చేసుకునేందుకు కేంద్రం సమస్యలు పరిష్కరించి సహకరించాలి. ఒక ప్రాజెక్టు నిర్మాణంతో వచ్చే ఉత్పత్తి ఎంత? నీటి సంపద ఎంత? మత్స్యసంపద ఎంత? జీవవైవిధ్యం ఎంత? పశుసంపద ఎంత? మొత్తంగా వచ్చే సమాజ సంపద ఎంత? వీటన్నింటిని పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం వ్యవహరించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

# రామన్న రాజ్యంలో రాజన్న కూతురు!

కరీంనగర్, జూన్ 25:తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్న వైఎస్ షర్మిల పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. తెలంగాణలో రాజన్న రాజ్యమే లక్ష్యం అంటూ ప్రజల్లోకి వెళ్తున్నారు. రైతులు, నిరుద్యోగం తదితర అంశాలపై ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. శుక్రవారం మంత్రి కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో పర్యటించనున్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడంలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యటనకు వెళ్తూ.. మార్గమధ్యలో ఒంటిమామిడి, ప్రజ్ఞపూర్ గ్రామాల్లోని వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. షర్మిల టూర్ నేపథ్యంలో సర్వత్ర టెన్షన్ వాతావరణం నెలకొంది.

మాజీ వైఎస్ జయంతి సందర్భంగా జూలై 8న కొత్త రాజకీయ పార్టీని షర్మిల ప్రారంభించబోతున్నారు. పార్టీ విధివిధానాలు, జెండా, అజెండాను కూడా ఆరోజే ప్రకటిస్తారు. అందుకు తగ్గట్లు ఏర్పాటు కూడా చేస్తున్నారు. మరోవైపు తెలంగాణ ప్రభుత్వంపై తరచు విమర్శలు చేస్తూ వార్తల్లో ఉంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్ష పార్టీల కంటే తామకే టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎదుర్కొనే సత్తా ఉందనే సంకేతాన్ని ప్రజల్లో పంపుతున్నారు. ఈ క్రమంలోనే షర్మిల వరుసగా జిల్లాల పర్యటనకు శ్రీకారం చూట్టారు. ఇటీవల వికారాబాద్, సూర్యపేట జిల్లాల్లో పర్యటించారు. శుక్రవారం మంత్రి కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో షర్మిల పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులను పరామర్శించనున్నారు.

# తెరుచుకోనున్న విద్యాసంస్థలు.. హాజరవుతున్న అధ్యాపకులు



హైదరాబాద్ , జూన్ 25:తెలంగాణలో కరోనా మహమ్మారి తగ్గడంతో విద్యాసంస్థలు ప్రారంభం కానున్నాయి. జులై 1 నుంచి పాఠశాలలు, కాలేజీలు ప్రారంభించాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. విద్యా శాఖ ఆదేశాలతో ఇవాళ్టి నుంచి పాఠశాలల అధ్యాపకులు, కాలేజీ లెక్చరర్లతో పాటు నాన్ టీచింగ్ స్టాఫ్ కూడా విద్యాసంస్థలకు హాజరు అవుతున్నారు. దాదాపు 3 నెలల తర్వాత టీచర్లు, లెక్చరర్లు విద్యాసంస్థలకు తిరిగి హాజరవుతున్నారు.

మరోవైపు విద్యాసంస్థలు తిరిగి తెరుచుకోనున్న నేపథ్యంలో తెలంగాణ విద్యాశాఖ కీలక సూచనలు చేసింది. స్కూళ్లు, కాలేజీలను పరిశుభ్రంగా ఉండాలని తెలిపింది. సామాజిక దూరం పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలను పాటించాలని ఆదేశించింది. కాగా, కరోనా కారణంగా ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం పదో తరగతి, ఇంటర్ పరీక్షలను రద్దు చేసిన సంగతి తెలిసిందే.

# జాతీయ సగటు కంటే అధికంగా రికవరీ రేటు: సీఎం జగన్



అమరావతి, జూన్ 25: రాష్ట్రంలో కోవిడ్ యాక్టివ్ కేసులు 50 వేల దిగువకు తగ్గాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పాజిటివిటీ రేటు 5.23 శాతంగా ఉందన్నారు. కోవిడ్ నియంత్రణ, నివారణ వ్యాక్సినేషన్‌పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోవిడ్ నియంత్రణ, నివారణ చర్యలపై ముఖ్యమంత్రికి అధికారులు వివరాలు అందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. 6 జిల్లాల్లో(కడప, గుంటూరు, నెల్లూరు, విజయనగరం, విశాఖపట్నం, కర్నూలు) 5 శాతం కంటే తక్కువ పాజిటివిటీ రేటు ఉందని తెలిపారు. జాతీయ సగటు కంటే అధికంగా రాష్ట్రంలో రికవరీ రేటు ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రికవరీ రేటు సగటు 96.59శాతం, ఏపీలో 96.67శాతంగా ఉందన్నారు.

ప్రయివేటు ఆస్పత్రుల్లో అక్యుపై అయిన పడకల్లో 76.51శాతం పడకల్లో రోగులకు ఆరోగ్య శ్రీ కింద చికిత్స అందిస్తున్నామని తెలిపారు. 104కు గణనీయంగా కాల్స్ తగ్గాయని, జూన్ 25న కేవలం 1021 కాల్స్ వచ్చాయని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో మందులు జీఎమ్‌పీ, డబ్ల్యూహెచ్‌ఓ ప్రమాణాలతో ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు తెలిపారు. అలాగే ఈఎస్ఐ ఆస్పత్రుల్లోకూడా జీఎంపీ మరియు డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలున్న మందులు ఉండాలన్నారు.

ఆస్పత్రుల్లో శానిటేషన్, రోగులకు అందించే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని, నిరంతరం మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. అలాగే ఆస్పత్రి భవనాల నిర్వహణ, వైద్య పరికరాల నిర్వహణపై ప్రత్యేక ఎస్‌ఓపీలను తయారు చేయారు చేయాలని తెలిపారు. మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, రోగులకు ఆహారంపై పర్యవేక్షణ ఉండాలన్నారు. అలాగే వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది హాజరుపై పర్యవేక్షణ ఉండాలిదీని కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని పేర్కొన్నారు.

# సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేయండి

సిరిసిల్ల రూరల్, జూన్ 25: సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన సందర్భంగా, ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం (కేసీఆర్ నగర్) కోసం ఏర్పాటు చేస్తున్న ఫార్మేషన్ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, మున్సిపల్, సర్వే అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి కేటీఆర్ సూచనలకు అనుగుణంగా పనులు జరుగాలని, రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్‌ను పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, సర్వేయర్లు, అధికారులు, తదితరులు ఉన్నారు.

